6_6.qxd 2/3/2026 12:02 AM Page 1



## శివరాత్రి విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీతలపై అవగాహన



**బల్లికురవ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నరసరావుపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అద్దంకి పరిధిలోని గోవాడ, చిన్న కొత్తపల్లి గ్రామాల్లో ప్రచార రథంతో పర్యటించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంధాల మహాశివరాత్రి ప్రాధాన్యతలను ప్రజలకు వివరించారు.

**మహాశివరాత్రి ప్రాధాన్యతను ఈ విధంగా వివరించారు :**

శివలింగం పైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ పరమాత్మలకు గుర్తు అని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడు అని వివరించారు. మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొడున పెడుతారు.. మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయం అన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి శ్రద్ధగా జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానంను తెలియజేయడం అని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు, ఘడియంపెద్దరెడ్డి, రమేష్, పగడాల రామయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, కుంచాల చిన్న వెంకయ్య, హరిదాసు నగేష్, జమ్ముల సీతయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అనుభవం లేని పాలనతో ఐదేళ్లు వెనుకబాటు

- రూ.17 కోట్ల 37 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు
- యనమలలో సబ్‌స్టేషన్ ప్రారంభం - రూ.7.40 కోట్ల ఆర్అండ్‌బి రోడ్లకు శంకుస్థాపన
- 95 మందికి 51,48,729 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
- రూ.4కోట్ల స్త్రీ నిధి చెక్కులు అందజేత
- పలు సీసీ రోడ్లు ప్రారంభోత్సవం - మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి





**మార్టూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త**

పాలనపై అవగాహన , అనుభవం లేని వ్యక్తికి అధికారాన్ని అప్పగించడం వల్ల గత ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకపోగా, పదేళ్ల పాలనలో వెనుకబాటుకు గురైందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.ఆ పరిస్థితిని ప్రత్యక్షంగా అనుభవించిన ప్రజలే అపార అనుభవం, సమర్థత కలిగిన చంద్రబాబునాయుడుకు మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించారని తెలిపారు. సోమవారం పర్చూరు నియోజకవర్గంలో యద్దనపూడి, మార్టూరు మండలాల్లో నిర్వహించిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ ఛార్జీల తగ్గింపు ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తాను మంత్రి అయిన అనంతరం తొలిసారిగా యనమదల విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశామని, ఆ తరువాతే రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా ఉప కేంద్రాలకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ట్రూ ఆఫ్ ఛార్జీల పేరిట సామాన్యులపై విద్యుత్ భారం మోపారని, ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ ఛార్జీలను తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. వచ్చే ఏడాది మరో రూ.1.19 పైసలు తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పెన్షన్లు, ఫీజు బకాయిలు, రైతులకు భరోసా ఒకే సంతకంతో పెన్షన్లు పెంచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల కాలేజీ ఫీజు బకాయిలు, పెట్టగా, కూటమి ప్రభుత్వం ఒకే సారి రూ.10వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. దేశంలో తొలిసారిగా బార్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, దీనికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషే కారణమని తెలిపారు. ఈ క్రమంలో బార్లీ రైతులకు రూ.270 కోట్లు విడుదల చేశామని తెలిపారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**యద్దనపూడి అభివృద్ధే లక్ష్యం - ఎమ్మెల్యే ఏలూరి :**

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలన అనంతరం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందన్నారు. గత ప్రభుత్వంలో అరాచకాలు, భౌతిక దాడులు తప్ప అభివృద్ధి లేదని, తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా అభివృద్ధి, సంక్షేమాన్ని వేగవంతం చేసిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు. యద్దనపూడి మండలంలో సాగునీరు, తాగునీరు, రోడ్ల సమస్యలకు దశల వారీగా పరిష్కరిస్తామని అన్ని గ్రామాలకు ఇంటింటి కుళాయి ద్వారా నీటి సరఫరా లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. నీటి వసతి కల్పిస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగామరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.


**లోఓల్టేజి సమస్యకు శాశ్వత పరిష్కారం :**

యద్దనపూడి,పూనూరు ఉప కేంద్రాలపై అధికలోడ్ కారణంగా లో ఓల్టేజి సమస్య ఏర్పడుతుండడంతో యనమదలలో కొత్త ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఉప కేంద్ర నిర్మాణానికి స్థలం కేటాయించిన డాక్టర్ లింగా శ్రీనివాసరావు, కేవీరెడ్డిలను అభినందించారు. యద్దనపూడిలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రూ.17.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాన,ప్రారంభోత్సవాలు మంత్రి గొట్టిపాటిరవికుమార్,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గంలో రూ.17 కోట్ల 37 లక్షల వ్యయంతో పలుఅభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ.1.40 కోట్ల వ్యయంతో యనమదల నుంచి బల్లికురవ- పోలూరు ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.రూ.85 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. యనమదలలో రూ.4.65 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు.దర్శి నుంచి వలపర్ల సమీపంలోని ఎంఎస్ఎంఈ సేజ్ వరకు రూ.6 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

**రూ.4 కోట్ల స్త్రీ నిధి రుణాలు, 95 మందికి చెక్కులు :**

స్త్రీ నిధి పథకం కింద రూ.4 కోట్ల రుణాలు మంజూరు మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యే, ఏలూరి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సు మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం 95 మందికి రూ.51,48,729 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. డీఆర్‌డీఏ సహకారంతో ఆరుగురు లబ్దిదారులకు ఒక్కో లబ్దిదారునికి రూ.70వేల సబ్సిడీతో 6 ఎగ్ కార్ట్స్ పంపిణీ చేశారు.


### ఉత్తమ ఎంఈఓ అవార్డు గ్రహీత ఆంజనేయులకు వికాష్ హైస్కూల్ ఉపాధ్యాయుల సన్మానం



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లాలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగిన సందర్భంగా యర్రగొండపాలెం మండలవిద్యాశాఖ అధికారి పి.ఆంజనేయులుకు జిల్లా ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందుకున్న సందర్భంగా అవార్డు గ్రహీత ఆంజనేయులును చైతన్య స్కూల్ డైరక్టర్ చింతపల్లి కోటిరెడ్డి ఆ పాఠశాల హెడ్ మాస్టర్ షేక్ అబ్దుల్లా, ఉపాధ్యాయులు కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అదే విధంగా జిల్లా ఉత్తమ సీఆర్ఎంటీగా అవార్డు పొందిన కోటేశ్వరావు, వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గుమ్మా రాజయ్యకు గౌరవ డాక్టరేట్ రావడంపై వారందరిని సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఆంజనేయులు యర్రగొండపాలెం మండల ఎంఈఓగా వచ్చినప్పటినుండి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పనితీరులను సమీక్షించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగుపరుస్తూ తనపై అధికారులు ఆదేశించిన ఆదేశాలను పాటిస్తూ పై అధికారుల మన్ననలను, ప్రశంసలను పొందిన అధికారి అని కొనియాడారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన మొట్టమొదటిసారిగా ప్రభుత్వం వారు గుర్తించి జిల్లా ఉత్తమ ఎంఈఓగా అవార్డును ప్రకటించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ కోటిరెడ్డితో పాటు షెడ్ మాస్టర్ షేక్ అబ్దుల్లా, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ రేంజ్ వారు యర్రగొండపాలెం పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యర్రగొండపాలెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏ.ప్రసన్న జ్యోతి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్ధి అడవులు, వన్య ప్రాణాలను సంరక్షించుట గురించి తెలుసుకుని ఉండాలని, అదే విధంగా తమదైన బాధ్యత కలిగి ఉండాలని కోరారు. చిత్తడి నేలలు ప్రాముఖ్యతపై విద్యార్థులకు సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాశీం, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, బాధరయ్య, కాశీంవలి, శివశంకర్ నాయక్, డీవైఆర్వోలు డి.శివ శంకర్, మంగే నాయక్, బీట్ ఆఫీసర్లు ఎస్కే ఖాజా మొహిద్దిన్, నాసరయ్య, వెంకటయ్య, కళ్యాణి, ఫక్రుద్దిన్, దాసయ్య, వెంకటేశ్వర్లు, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన దోర్నాల ఎంపీడీవో ప్రసూనాదేవి



**పెద్దదోర్నాల, పిబ్రవరి 2, ప్రభాతవార్త**

2026 సంవత్సరపు వార్త నూతన క్యాలెండర్‌ను సోమవారం చర్చ్ ఆఫ్ క్రైస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెద్దదోర్నాల ఎంపీడీవో టీఎల్ ప్రసూనదేవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టీఎల్ ప్రసూనాదేవి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి క్యాక్రమాలు, సామాజిక అవగాహన అంశాలను సులభంగా చేరవేయడంతో వార్త దినపత్రిక కీలకపాత్ర పోషిస్తుంది అన్నారు. అదే క్రమంలో వార్త క్యాలెండర్ ప్రతి నెలలో ప్రత్యేక దినోత్సవాలు, తిధి వార నక్షత్రాలు, ప్రజోపయోగ అంశాలను గుర్తు చేసేలా రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల నాయకులు పాల్గొన్నారు.

## అటవీశాఖ అనుమతి నిరాకరణతో కాలి నడకనే శ్రీశైలం







**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఆత్మకూరు - వెంకటాపురం నుండి అడవి మార్గం గుండా అటవీ శాఖ అనుమతి నిరాకరించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేది లేక కర్ణాటక రాష్ట్రం, రాయలసీమ జిల్లాల నుండి భక్తులు రోడ్డు మార్గం కాలినడకన శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. వీరు దోర్నాల మీదుగా శ్రీశైలం కాలినడకన వెళ్తున్నారు. ఫిబ్రవరి 8 నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. దీంతో ప్రతి ఏడాది మహాశివరాత్రి,ఉగాది బ్రహ్మోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం, రాయలసీమ జిల్లాలకు చెందిన భక్తులు అడవి మార్గం గుండా కాలి నడకతో శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సారి భద్రతా కారణాలు, అడవి అమర్చిన కెమెరాలు, పులుల సంతాన ఉత్పత్తి జరిగే సమయం కావడం, ఆ సమయంలో భక్తులకు వన్య మృగాలతో ప్రమాదాలు జరుగుతాయని, అడవి సంరక్షణ పేరుతో బక్తులు అడవి మార్గం గుండా కాలి నడక ప్రయాణాన్ని అటవీశాఖ అధికారులు కాలినడక ప్రయాణాల అనుమతి నిరాకరించారు. దీంతో చేసేది లేక భక్తులు అంచలంచెలుగా ఆత్మకూరు నుండి కర్నూలు గుంటూరు- జాతీయ రహదారిన కాలినడకతో దోర్నాల మీదుగా శ్రీశైలానికి తమ ప్రయాణాలను సాగిస్తున్నారు. దీర్ఘ దూరం,నడవాల్సి రావడంతో శారీరక అలసట,ఆహారం,తాగునీరు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ మల్లన్న దర్శనం కోసం కష్టాలు సహజమే అంటూ మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో తమ ప్రయాణాన్ని కొనసాగించడం అందరి మనస్సులను తాకింది. భవిష్యత్తులోనైనా భక్తులకు ఇబ్బందులు లేకుండా అటవీశాఖ,నంద్యాల జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గాలు లేదా ప్రత్యేక అనుమతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వందశాతం పూర్తి చేయాలి

**వెలిగండ్ల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంబించిన (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో సచివాలయ సిబ్బంది పాల్గొని వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో రెడ్డిగారి గంగాధర్ తెలిపారు. ట్రైనింగ్ ముగించుకుని సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని కంకణంపాడు, పాపిరెడ్డిపల్లి, పందువ నాగులవరం, గుడిపాటిపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండో తేదీ సోమవారం నుండి బుధవారం వరకు సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరుగుతుందని స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం నందు పని చేస్తున్న సిబ్బంది అందరూ పాల్గొని 100 శాతం సర్వే పూర్తి చేయాలని ఏ శాఖ వారికి మినహాయింపు లేదని సర్వేలో ఎవరు పాల్గొనకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ సర్వేలో స్వచ్ఛందంగా పాల్గొని సర్వేకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సర్వే పర్యవేక్షణకు మండల స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యతలేని మరుగుదొడ్లు.. నాసిరకంగా నిర్మాణాలు

- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ నిర్మాణాలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు






**పుల్లలచెరువు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పుల్లలచెరువులోని మండల పరిషత్ కార్యాలయం తహసీల్దార్ కార్యాలయాల్లో, ఆయా ప్రదేశాల్లో ప్రజల సౌకర్యం కోసం ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర నిధులతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత కరువైందని ప్రజలు నిర్మాణదారులపై పెదవిరుస్తున్నారు. ఎవ్వరు పట్టించుకోకపోవడంతో సందిట్లో సడేమియా అన్నట్టు నాసిరకంగా మరుగుదొడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి అని గత 20 రోజుల నుంచి చకచకా నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఆ దిక్కు చూసిన నాధుడే లేరని పలువురు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని వారంటున్నారు. దీంతో పనులు చేస్తున్న నిర్వాహకులు నిబంధనలకు నీళ్ళొదిలి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తున్నారు. కేవలం నాలుగు రోజుల్లో స్లాబ్ వేసేందుకు గోడ నిర్మాణ పనులను పూర్తి చేశారు. అంతలోనే ఇంత తొందరేంది అనే విధంగా నీటితో క్యూరింగ్ చేయాల్సి ఉన్నా అలా గోడలు జరిగినాయే లేదో నీళ్ళు కొట్టాల్సింది పోయి అలా చేయడం లేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ సంబంధిత అధికారుల కళ్లముందే నిర్మాణాలు చేపడుతున్నా పట్టి పట్టనట్లుగా ఉండటం గమనార్హం ఇంత దారుమైన పనులు నిర్మాణాలు ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

## మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ సతీమణి మృతి విచారకరం



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మండలంలోని కలవళ్ల గ్రామ మాజీ సర్పంచ్, మోదేపల్లి లక్ష్మీనారాయణ సతీమణి స్వర్గీయ ఎం.లక్ష్మమ్మ మరణించడం కడు విచారకరమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నాగేశ్వరరావు బాధతప్త హృదయంతో అన్నారు. ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జయసూర్యకు ఎమ్మెల్యే ఇంటూరి అభినందనలు



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మండలంలోని పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన దమ్ము థామస్ కుమారుడు జయసూర్య ఇటీవల విడుదలైన గ్రూపు-2 ఫలితాలలో విజయం సాధించి, ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సంపాదించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును జయసూర్యమర్యాదపూర్వకంగా కలవగా ఆయన అభినందించారు. ఇంకా కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. జయసూర్య తండ్రి థామస్, కాలనీ వాసులు పత్రే శ్రీను, దాసరి ఆదినారాయణ, బొడ్డు మధు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వ్యవసాయ శాఖ జేడీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన యారవ రమా శ్రీనివాస్



**పామూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

సోమవారం ఉదయం విజయవాడలోని వ్యవసాయశాఖ జేడీఎం వారి క్యాంపు కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు మార్కెట్ యార్డు చైర్మన్లు.రాష్ట్రంలోని ప్రతి మార్కెట్ యార్డులు అభివృద్ధి కొరకు మీ సహాయ సహకారాలు అందించాలని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు అన్నారు.

## గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి

- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి

**పెద్దారవీడు,పిబ్రవరి 2, ప్రభాతవార్త**

గామస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడంపై సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.యర్రగొండపాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని కలనూతల గ్రామంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. ప్రతి కార్యకర్త గ్రామ స్థాయి నుంచే ప్రజలతో అనుబంధం పెంచుకోవాలన్నారు. అందరి ఆమోదంతోనే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోసర్పంచ్ కొర్ర కీరా భూలక్ష్మి నాయక్ ,వైసీపీ నాయకులు కటికల సాల్మన్, నల్లబోతుల శ్రీను ,పంది కాశయ్య, అంగిరేకుల వెంకటరమణ, ఒంటేరు ఎల్లయ్య ,ఒంటేరు పెద్ద ఆవులయ్య, వెంకటసుబ్బయ్య, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు..

## అవినీతిని ప్రశ్నిస్తే కేసులా..?

- గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ దుడ్డు జయపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించండి
- మంత్రి స్వామికి ఫిర్యాదు పత్రాన్ని అందించిన సుజన్ మాదిగ



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా గురుకులాల కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న దుడ్డు జయ చేసే అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామికి సోమవారం తూర్పు నాయుడుపాలెం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా గురుకులాల కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న దుడ్డు జయ గురుకులాల్లో పని చేసే కాంట్రాక్టు టీచర్లు నియామకంలో టెట్ క్వాలిఫై కాకుండా ఉద్యోగాలు ఇచ్చారని అదే విధంగా నాన్ టీచింగ్ సిబ్బందిని ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా సంబంధిత శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకుపోకుండా వారి వద్ద పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా గురుకులాల్లో పలు ఆహార పదార్థాలు టెండర్లు కూడా బినామీ పేర్లతో చేస్తున్నారని మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో పలుమార్లు ఫిర్యాదు చేయడం జరిగింది. అవినీతి అక్రమాలు చేస్తున్న అధికారులపై పోరాటం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం సమంజసం కాదని అదే విధంగా జిల్లా కోఆర్డినేటర్‌గా జయ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు గురుకులాల్లో చేపట్టిన నియామకాలు, ఆమె చేసి అక్రమాలు, అవినీతిపై పూర్తి ఆధారాలను మంత్రికి అందజేయడం జరిగింది. దీనిపూ పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని సుజన్ మాదిగ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అవినీతి రహిత పాలనను అందిస్తామని కూటమి ప్రభుత్వం పదే పదే చెప్తుందని జిల్లా కోఆర్డినేటర్ గురుకులాల్లో పెరిగిన నియామకాలలో, బాల, బాలికలకు అందజేసే ఆహార పదార్థాల కాంట్రాక్టు, పలు కార్యక్రమాల్లో పూర్తి స్థాయిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఇటువంటి అధికారిణి జిల్లా కోఆర్డినేటర్‌గా కొనసాగిస్తే గురుకులాలలో అవినీతి ప్రభావం పెచ్చుమీరి అక్కడ చదువుతున్న విద్యార్థులపై భాగా ఆ ప్రభావం చూపుతుందని, క్వాలిఫై లేని టీచర్ల నియామకంతో నాణ్యత ప్రమాణాలు కూడా తగ్గుతాయని, తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తక్షణమే ఆమెని విధుల నుండి తొలగించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మంత్రిని కోరడం జరిగింది. పైసమస్యలను సావధానంగా విన్న రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయస్వామి స్పందిస్తూ కోఆర్డినేటర్ పై ఇచ్చిన ఫిర్యాదును గురుకులాల రాష్ట్ర సెక్రటరీకి పంపించి విచారణ చేపడతానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీఎస్ ప్రతినిధులు త్యాగరాజు, నారాయణ, ఆనంద్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## జనతా వారధిలో కార్మికుల సమస్యలు

- కలెక్టర్ కార్యాలయంలో జేసీకి వినతి




**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రారంభించిన జనతా వారధి కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు తమ సమస్యలను బిజెపి నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి త్వరిత పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. 2019 నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు నిలిచిపోవడంతో వేల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ రాంప్రసాద్, 23వ బ్లాక్ అధ్యక్షులు వెంకట్రెడ్డి, మద్దెల ప్రసాద్, ఎస్. వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం యథావిధిగా కొనసాగాలి

- కాంగ్రెస్ డిమాండ్



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మార్కాపురం మండలంలోని పెద్ద నాగులవరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త షేక్‌సైదా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మహబూబ్ వలి మాట్లాడుతూ,2006 ఫిబ్రవరి 2న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రారంభించినఈ పథకం పేదలవలసలను అరికట్టేందుకు దోహద పడిందన్నారు. మహాత్మా గాంధీ పేరు మార్చడం అవసరం లేదని,కేంద్ర-రాష్ట్ర నిధుల వాటా తగ్గించడం వల్ల పేదల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. మహాత్మా గాంధీ దేశానికి జాతిపిత అని, ఆయన పేరును మార్చడం సరైంది కాదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్,ఉమ్మడి జిల్లాప్రధాన కార్యదర్శి షేక్‌సుభాని,షేక్ అబ్దుల్లా, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## అన్నా మిత్రమండలి ఆధ్వర్యంలో

- కరెంట్ షాక్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్సీపి ఇంచార్జ్ అన్నా రాంబాబు ఆదేశాల మేరకు కరెంటు షాక్ బాధిత కుటుంబానికి అన్నా మిత్రమండలి ఆధ్వర్యంలో సోమవారం రూ.1,20,000లు ఆర్థిక సహాయం అందజేశారు. మార్కాపురం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వెనుక కరెంటు షాక్‌కు గురై గుంటూరులో చికిత్స పొందుతున్న షేక్ నిజాముద్దీన్ కుమారుడు షేక్ ఖాసీం వలి కుటుంబానికి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం చేసినట్లు అన్నా మిత్ర మండలి వారు తెలిపారు. గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న షేక్ ఖాసీం వలిని కలిసి వారి యోగ క్షేమాలు తెలుసుకుని, చికిత్స గురించి డాక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. గుంటూరుకు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని కలిసిన వారిలో అన్నా మిత్రమండలి మార్కాపూర్ మైనార్టీ నాయకులు వార్డెన్ నజీర్, షేక్ ఖాసిం వలి, 18 బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్, మార్కాపురం వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా, సీఎం ఖాసీం, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.బాధిత కుటుంబానికి ఇంకా ఎవరైనా దాతలు ఆర్థిక సహాయం చేయాలి అంటే 9966466012 ఫోన్ పే నెంబర్‌కి పంపాలని కోరారు.

### తిరుపతి లడ్డుపై తప్పుడు ప్రచారాలు ఆపాలి - అన్నా రాంబాబు



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

తిరుపతి లడ్డు ప్రసాదంపై అసత్య ప్రచారాలు చేస్తున్న కూటమి నేతలు వెంటనే వాటిని ఆపాలని గిద్దలూరు మాజి ఎమ్మెల్యే,మార్కాపురం వైయస్ఆర్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు డిమాండ్‌చేశారు.ఈ మేరకు మార్కాపురం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ లబ్ధి కోసం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడం తగదన్నారు. ఎన్ డి డి బి/ఎన్ డి ఆర్ ఐ నివేదికలు స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.తప్పుడు ఆరోపణలు చేసిన వారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి,నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

7_7.qxd 2/3/2026 12:03 AM Page 1



## పోలీసు కేసులు నమోదు కాకుండా పిల్లల భవిష్యత్తుకు క్రమశిక్షణతో నడుం బిగించండి

**- ఎఫ్ఐఆర్ నమోదైతే ఎటువంటి ఉద్యోగాలు రావు - ఎస్సై అజయ్‌బాబు**



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

తల్లిదండ్రులు ముఖ్యంగా తమ పిల్లలు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా క్రమశిక్షణతో ముందుకు కొనసాగేందుకు పాటు పడాలని లేని పక్షంలో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు అయితే వారి జీవితం అంధకారం అవుతుందని సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడులోని మండల డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో సంతనూతలపాడు క్లస్టర్ స్థాయిలో సోమవారం నాడు జరిగిన మహిళల చట్టాలపై అవగాహన సదస్సుకు సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు ముఖ్య అతిధిగా పాల్గొని అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మరొక ముఖ్య అతిధిగా సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి మండల వెలుగు, డీఆర్‌డీఏ ఏపీఎం టి.బాబురావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని సంతనూతలపాడు క్లస్టర్ వెలుగు సీసీ సీహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై అత్యాచారాలు, అనుచిత ప్రవర్తనలకు పాల్పడితే అది మర్డర్ కేసుగా నమోదు అవుతుందని సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు వెల్లడించారు. మహిళలపై వేదింపులకు సంబంధించి చట్టంలో పలు కేసులు పొందుపరిచినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా వివాహాలు జరిగిన తదుపరి భార్యను కొట్టి, వేదించి ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు అవుతుందన్నారు. మహిళలు తమకు పుట్టబోయే బిడ్డకు సంబంధించి ముందస్తుగా అబార్షన్ చేయించుకుంటే వాటిపై కేసు నమోదు కలదన్నారు. సమాజంలో తల్లిని ప్రేమించిన వాడు భార్యని ప్రేమిస్తాడన్నారు. మహిళలు వేదింపులకు సంబంధించి ఎన్నో కొత్త చట్టాలు ఏర్పడినట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు వెల్లడించారు. ఎవ్వరు సైబర్ నేరాలకు పాల్పడరాదన్నారు. తమపిల్లలను మంచి ప్రవర్తనతో పెంచితే వారి భవిష్యత్తు ముందంజలో ఉండనున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తమ పిల్లలను నేరాల వైపు వెళ్లకుండా క్రమశిక్షణతో పెంచాలని ఈ సందర్భంగా మహిళలకు సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు సూచించారు. సమాజంలో ఆడ,మగ వివక్ష ఉండరాదని అందరిని తల్లులు సమానంగా పెంచాలని ఎంపీడీవో సురేష్‌ఆబు తన ప్రసంగంలో తెలిపారు. ముఖ్యంగా తల్లులు తమ కోడళ్లను కూతుళ్లగా భావిస్తే సమాజంలో ఎటువంటి విభేధాలు చోటు చేసుకోవని ఎంపీడీవో సురేష్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి తల్లి ఆయా భేధాలను విడనాడాలన్నారు. ముఖ్యంగా మూఢ నమ్మకాలను మహిళలు తరిమి కొట్టాలన్నారు. కుటుంబంలో స్త్రీ భాగా చదివితే ఆ కుటుంబం అంతా అన్ని రంగాల్లో రాణిస్తాయన్నారు. తల్లులు తమ పిల్లలను మంచి ప్రవర్తనతో ముందుకు కొనసాగేందుకు నడుంబిగించాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. 1986 సంవత్సరంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన పాలనలో ముఖ్యంగా తండ్రి ఆస్తిలో కూతురుకు తన పాలనలో ముఖ్యంగా తండ్రి ఆస్తిలో కూతురును కూడా హక్కు కల్పనకు చట్టం చేయడం మహిళలకు నేడు ఒక వరమని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మహిళలు చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. మహిళలు చట్టాలను సక్రమంగా ఉపయోగించుకొని సమ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని మండల డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం టి.బాబురావు కోరారు. అనంతరం సంతనూతలపాడు కేంద్రం మహిళా చట్టాలపై ర్యాలీ నిర్వహించారు. సంతనూతలపాడు, మండలంలోని మద్దులూరు, గుమ్మలంపాడు, మైనంపాడు, సంతనూతలపాడు క్లస్టర్ పరిధిలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సులను నిర్వహించారు. వెలుగు సీసీలులు పి.రామాంజనేయులు, ఎన్.చెంచులక్ష్మీ, వి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు సదస్సులనుపర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు, ఈనారి గ్రూపుసభ్యులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకి వచ్చారు

**- టీడీపీ నేత మద్దినేని హరిబాబు**



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

స్కిల్ కేసులో ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందని స్కిల్ కేసులో ఆయన ప్రేమయంపై ఆధారాలు లేవని ఈడీ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సంతనూతలపాడు మండల తెలుగుదుశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తన ప్రసంగంలో స్వగతించారు. సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలోనే బాబుకు సీఐడీ క్లీన్ ఇచ్చిందని, ఇప్పుడు ఈడీ కూడా క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో కొందరు నిందితులు ప్రభుత్వ నిధులను మళ్లించినట్లు గుర్తించామని కానీ చంద్రబాబునాయుడు పాత్ర మాత్రం ఏమి లేదని పేర్కొంది అన్నారు. రాష్ట్ర రాజకీయాలలో కీలక మలుపును ఒక కారణమైన చంద్రబాబునాయుడుకు ఎలాంటి సంబంధం లేదని ఈ కేసులో గత వైసీపీ పాలనలో ఆయనను ఇరికించి అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు రాజమండ్రి జైల్లో పెట్టి సరైన సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేనప్పటికి వైసీపీ నాయకులు ఎంతో గగ్గోలు పెట్టారో ఇప్పుడు ఈడీ కూడా చంద్రబాబు ప్రేమయం లేదని చెప్పడంతో వాళ్ల నోళ్ళు మూత పడినట్టు ఆయన పేర్కొన్నారు. ఈడీ నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు క్లీన్ చీట్ ఇవ్వడం ఎంతో హర్షణీయమని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు వెల్లడించారు. ఈ సమావేశంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, టీడీపీ నాయకులు పి.ఇంద్రబాబు, నాదెండ్ల ఆంజనేయులు, హరి తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా స్థాయి క్విజ్ విజేత చిలకపాడు హైస్కూల్ విద్యార్థిని లిఖితకు**

## ఉత్తమ అవార్డు అందించిన మంత్రి డోలా కలెక్టర్ రాజాబాబులు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఒంగోలు జిల్లా 57వ ప్రకాశం పంతుల అవతరణ దినోత్సవ వేడుకల్లో జిల్లా స్థాయిలో క్విజ్ పోటీల్లో సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థిని అన్నవరపు లిఖిత ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా లిఖితకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబులు ఉత్తమ అవార్డును అందజేశారు. అదే విధంగా ఉపన్యాస పోటీల్లో చిలకపాడు హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని కుదుముల శ్రావ్య తృతీయ స్థానం సాధించారు. శ్రావ్యకు కలెక్టర్ రాజాబాబు ఈ సందర్భంగా అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, డీఆర్ఓ ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్ కుమార్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ యంతిబాబు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచరిత వీరయ్య చౌదరి, చిలకపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.స్వప్న రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం చిలకపాడు హైస్కూల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయా జిల్లా స్థాయి విజేతలైన విద్యార్థినీలు లిఖిత, శ్రావ్యలను వీరికి గైడు టీచర్ శకుంతేలదేవిని హెచ్ఎం స్వప్న రాజు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## అన్ని వర్గాలకు అందుబాటులో బడ్జెట్

**- బీజేపీ మండల అధ్యక్షులు మందలపు వెంకట శేషయ్య**



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

యూనియన్ బడ్జెట్-2026 వికసిత్ భారత్ లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళల సాధికారిత, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మధ్య తరగతికి పన్ను రాయితీలు, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ బడ్జెట్ కీలకంగా ఉంది. ఐటీ, ఫార్మా, బయోఫార్మా రంగాలకు ప్రోత్సాహం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఊతం కలిగించేలా ఇది దేశ పురోగతికి మరో బలమైన అడుగుగా నిలుస్తుంది.

## క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసిన చిట్యాల



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఉమ్మనపల్లి పంచాయతీకి చెందిన రుద్రపాటి మార్టిన్ చిన్న కుమారుడు రుద్రపాటి జాన్ బ్లడ్ క్యాన్సర్‌తో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకాలజీ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్న విషయం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి తెలుసుకొని అతనిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో బాగోగులు గురించి తెలుసుకొని రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వైసీపీ యువ నాయకులు వెలుగోటి నరేంద్రరెడ్డి, కేసరి మధుసుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నెంబర్ ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అన్ని వార్డులలో పార్టీ కమిటీలు పూర్తి చేయాలి





**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

దర్శి మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో పార్టీ కమిటీలు పూర్తిచేయాలని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దర్శి పార్టీ ఆఫీసు నగర పంచాయతీలోని కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని వార్డు స్థాయి నుండి నిర్మాణం చేయటం జరుగుతుందని పార్టీలో కష్టపడి పని చేసిన వారిని గుర్తించి కమిటీలో వేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పార్టీ నేతలపై నాయకులపై దాడులు చేస్తున్నారు అని వీటని అందరూ ఎదుర్కోవాలి అని మీకు అండగా నేను ఎప్పుడు ఉంటాను అని అన్నారు. తిరుమల లడ్డులో కల్తీజరగలేదని సీబీఐ సుప్రీం కోర్టు చెప్పిన కూటమి ప్రభుత్వం పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఈ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని ప్రతి ఒక్కరు ఈ కమిటీల నిర్మాణంలో పాలు పంచుకోవాలని అన్నారు. మీకు ఏ కష్టం వచ్చిన మీకు మీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబ, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మున్సిపల్ వింగ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి కేవీరెడ్డి, కౌన్సిలర్లు మోహన్‌రెడ్డి, ఆవుల జ్యోతి శివారెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడు, లోకేష్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేతలను చట్టపరంగా శిక్షించాలి



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఏపీరాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పై అసభ్య పదజాలంతో దూషించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేతలు మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా మాజీ మంత్రి జోగి రమేష్‌పై దయచేసి వెంటనే ఈ ఇద్దరి వైకాపా నేతలపై తక్షణమే చట్టపరంగా శిక్షించుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సోమవారం ఉదయం దర్శి పోలీసు స్టేషన్ నందు దర్శి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఎం.మురళికి వినతిపత్రం అందజేసిన దర్శి తెలుగుదేశం పార్టీ నాయకులు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, దర్శి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు ఎస్వీ రామయ్య, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, దర్శి రామాలయం ట్రస్టు బోర్డు చైర్మన్ మునగా శ్రీను, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కమిటీ సభ్యులు షేక్ సుభాని, దర్శి మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కర్ణ శ్రీను, దర్శి టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనాథ్, నెలకుర్తి మాల్యాద్రి, దిరిశాల రామకృష్ణ, 2వ టీడీపీ అధ్యక్షులు సందు జనార్ధన్, వెంకటేశ్వరరెడ్డి, మల్లి నాగేశ్వరరావు, అమర్, పుల్లలచెరువు రామాంజి, సురేష్, ఇత్తడి అనోక్ తదితరులు ఉన్నారు.

## టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ మర్రి సత్యనారాయణ యాదవ్



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని జముకులదిన్నె గ్రామ సర్పంచ్ మర్రి సత్యనారాయణ యాదవ్ కూటమి ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చేస్తున్న అభివృద్ధికి టీడీపీలో చేరినట్లు సర్పంచ్ మర్రి సత్యనారాయణ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మర్రి సత్యనారాయణ కి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. ఆయనతో పాటు మరో పది కుటుంబాలని కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తుందని అదే విధంగా దర్శి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే నా ధ్యేయమని దర్శి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకి మంత్రులు పవన్ కళ్యాణ్, లోకేష్‌లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

దర్శి మండలం బొట్లపాలెం వాస్తవ్యులు గొల్లపాటి బుజ్జయ్య ఒకటో వర్ధంతి సందర్భంగా దర్శి కురిచేడు రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గొర్లపాటి ప్రసాద్, గొర్లపాటి తిమోతి, గురవయ్య, అశోక్, గురుదేవ్‌లు పాల్గొన్నారు.

## ఈఈఎంటీ విజేతల బహుమతుల ప్రధానోత్సవం



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన మందిరంలో ఈ నెల 1న జరిగిన రాష్ట్ర స్థాయి ఈఈఎంటీ విజేతల బహుమతుల ప్రధానోత్సవంలో భాగంగా ప్రకాశం జిల్లాలోని దర్శి మండలం నుండి అత్యధిక మంది విద్యార్థులు చేత ఈఈఎంటీ పరీక్ష ఆన్‌లైన్‌లో రాయించినందుకు గాను ఎంపీపీఎస్ యర్ర ఓబనపల్లి దర్శి మండలం నందు సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వాకిచర్ల చక్రధారి కి ఈఈఎంటీ రాష్ట్రస్థాయి విజేతల ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కి చీఫ్ గెస్ట్‌గా వచ్చిన జవహర్ లాల్ నెహ్రు టెక్నాలజీకల్ యూనివర్సిటీ, కాకినాడ వైస్ ఛాన్సలర్ అయిన శ్రీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ద్వారా అవార్డు అందుకున్న సందర్భంగా దర్శి మండల విద్యాశాఖ అధికారులు కే.మాలకొండయ్య, రమాదేవిల ద్వారా మెమోంటో అందుకుంటున్న వాకిచర్ల చక్రధారి.

## అగ్ని ప్రమాద బాధితులకి ఆర్థిక సాయం అందజేసిన బూచేపల్లి



**దర్శి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఇటీవల దర్శి పొదిలి రోడ్డులో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో మెకానిక్ షాపు దగ్ధం అయిన పులి కోటిరెడ్డికి సోమవారం రూ.25వేల ఆర్థిక సాయం అందజేసిన దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు , యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కొమరోలు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కొమరోలు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కొమరోలు మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ల నిర్మాణంలో భాగంగా చింతలపల్లి, హనుమంతురాయునిపల్లి, కసినేపల్లి, గోహారపల్లి, వర్ధన పల్లి, ఓబులాపురం, కూరాకు వానిపల్లి, నాగిరెడ్డిపల్లి, దద్దవాడ, గుండ్రెడ్డిపల్లి, నారాయణ పల్లి, వెంకటంపల్లి, అలసందలపల్లి తాటిచెర్ల మోటు పరిసర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈ విషయాన్ని ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

## వైకాపా నాయకులు అంబటిపై చర్యలు తీసుకోవాలి



**రాచర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైకాపా నాయకుడు అంబటి రాంబాబు చేసిన అసభ్యకర వ్యక్తిగత విమర్శల సరికాదని ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు రాచర్ల ఏఎస్ఐ పి శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అంబటి బహిరంగ క్షమాపణ చెప్పి తన మాటలు వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నేతలు యోగానంద్ జీవనేశ్వర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, కాశిరెడ్డి, సనావుల్లా ఖాన్, ఎంవి సాయి, రంగస్వామి రెడ్డి, ఆఫీస్ ఖాన్, భాస్కర్, చెంచయ్య, ఆరోగ్యం తదితరులు ఉన్నారు.

## షిర్డీ సాయిబాబా మందిరంలో రుద్రాభిషేక హోమం



**మార్కాపురం, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త**

షిర్డీ సాయిబాబా మందిరం పరిధిలోని చంద్ర మోళీశ్వర దేవాలయంలోసోమవారంమహాన్యాస పూర్వకఏకాదశ రుద్రాభిషేకం, దీక్ష హోమం, మూలమంత్ర చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమ అర్చన నిర్వహించారు. రేపుబుధవారం మహాకుంభాభిషేకం, శివ-పార్వతుల శాంతికళ్యాణం, స్వామివారి ఊరేగింపు జరుగుతుందని మందిరం కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మందిరం కార్యదర్శి గోపాలుని హరి హర రావు, కార్యనిర్వాహకురాలు వై ధనలక్ష్మి ్మ కోరారు. ఈ కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు పేరం సత్యనారాయణ, కోశాధికారి పిఎల్ఎన్‌వి నాగరాజు, కమిటీ సభ్యులు గోపిశెట్టి కొండయ్య, సాయిబాబా, విజయ్, కృష్ణమోహన్, మహిళా సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. మొత్తం కార్యక్రమాన్ని మందిరం మేనేజర్ సతీష్ నాయుడు పర్యవేక్షి ంచారు.

## బైరవకోనలో ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల ప్రత్యేక పూజలు



**సీఎస్‌పురం,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం బైరవకోన క్షేత్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ఇన్‌చార్జి దద్దాల చేత అర్చకులు జలాభిషేకం, తైలాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయనకు వేద ఆశీర్వచనం చేసి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి శాలువాతో సన్మానించారు. ముందుగా జలపాతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధితోపాటు మార్కాపురాన్ని మహా పట్టణంగా తీర్చిదిద్దుతాం

**- 9వ వార్డులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం**

**- మహిళల ఘన కృతజ్ఞతలు - ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**





**మార్కాపురం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ మార్కాపురం జిల్లా సాధనతో పాటు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మార్కాపురం పట్టణంలోని 9వ వార్డులో మార్కాపురం జిల్లా ప్రకటించిన సందర్భంగా కృతజ్ఞతగా ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా, ప్రజలు ఎదురేగి పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కాపురం జిల్లాకు ప్రజల మద్దతుతో 63 రోజుల పాటు నిరాహార దీక్షలు, రిలే నిరాహార దీక్షలు నిర్వహించినప్పటికీ వైసీపీ నాయకులు ఈ ప్రాంత ప్రజలను మోసం చేసి జిల్లా ఇవ్వలేదని విమర్శించారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మార్కాపురం జిల్లా ప్రకటిస్తానని వాగ్దానం చేసిన నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మాటను నిలబెట్టుకుని మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పుడు జిల్లా ఏర్పడటంతో సహించలేక వైసీపీ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని, ప్రజలు ఇవన్నీ గమనించి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహకారంతో మార్కాపురం పట్టణాన్ని త్వరలోనే ఒక మహా పట్టణంగా అభివృద్ధి చేసి చూపిస్తామని, తద్వారా ఈ ప్రాంతం అన్ని రంగాలలో ముందుకు సాగుతుందని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వెలుగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. మార్కాపురం జిల్లా సాధన, జిల్లా ఆసుపత్రి, పట్టణంలో రూ.42 కోట్ల వ్యయంతో ఇంటి ఇంటికి పైపులైన్ నీటి సరఫరా వంటి అనేక అభివృద్ధి పనులు తానే సాధించానని గర్వంగా చెప్పుకోగలనని, అయితే వైసీపీ నాయకులు ఈ ప్రాంతానికి ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. త్వరలోనే మార్కాపురం మెడికల్ కాలేజీ పనులను పూర్తి చేస్తామని, దీంతో ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మార్కాపురం జిల్లా ప్రకటించినందుకు కృతజ్ఞతగా 9వ వార్డు మహిళలు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, 9వ వార్డు నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా అర్జీలను నిరక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

**- గడువులోగా పరిష్కరించాలని అధికారులకు హెచ్చరిక**

**- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు**



**మార్కాపురం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

జిల్లాలో ప్రజా సమస్యలను నిరక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను హెచ్చరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో వ్యయ ప్రయాసలతో కలెక్టరేట్‌కు వస్తారని, అలాంటి అర్జీలను సానుకూలం గా విని ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, వచ్చిన ప్రతి అర్జీకి స్పష్టమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీదారులు తృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రధానంగా రెవెన్యూ అంశాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోయే ఆరు నెలల వ్యవధిలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యే అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, భోజన సదుపాయాలు కల్పించామని, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి శివరామిరెడ్డి, కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వాణిశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాలాజీ నాయక్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిఆదిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సత్వర పరిష్కారం లక్ష్యంగా మీ కోసం

**- జిల్లా పోలీసుల పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌లో 43 ఫిర్యాదులు స్వీకరణ**



**మార్కాపురం, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో మార్కాపురం జిల్లా పోలీసులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 43 ఫిర్యాదులను పోలీసులు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు నాగరాజుతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను సవివరంగా తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు అధికారులు భరోసా ఇచ్చారు. అలాగే ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు పంపించి, త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం, బాధితులకు తక్షణ సహాయం అందించడమే పోలీస్‌శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సీఐ సుబ్బారావు, పొదిలి సీఐ ఎం రాజేష్ కుమార్, పామూరు సీఐ శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

